ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 15 సెప్టెంబరు 2025



సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా రోషన్



బొడ్డు రోషన్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా బొడ్డు రోషన్ నియమితులయ్యారు.

ఈ మేరకు నియామకపత్రాన్ని ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రోషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో యూత్ కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా సోషల్ మీడియా కో ఆర్డి నేటర్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు, డీసీసీ అధ్య క్షురాలు కొక్కిరాల సురేఖకు ధన్యవాదాలు తెలిపారు.

మందమర్రిలో పిడుగు పాటు

● పాడైపోయిన ఫ్రిజ్‌లు, టీవీలు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని ప్రాణహిత కాలనీలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపుతో వర్షం పడగా ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో ఇళ్లలోని ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని 3, 4 బ్లాక్‌లలోని ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయని తెలిపారు. ఇంటికి దాదాపు లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. సంబంధిత అధికారులు తమను ఆదుకోవాలని కోరారు.

రైతులు యూరియాకోసం ఆందోళన చెందవద్దు

దండేపల్లి సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని, వదంతులు నమ్మవద్దని, రైతులకు సరిపడా యూరియా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందజేస్తామని దండేపల్లి మండల వ్యవసాధికారి గొర్ల అంజిత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దండేపల్లి, గూడెంలో సొసైటి వద్ద, ముత్యంపేట, గూడెం, ద్వారక, మేదరిపేట, లింగాపూర్ కస్టర్లు పరిధిలో రైతులందరికీ రైతు వేదికల వద్ద సోమవారం ఉదయం నుంచి యూరియా అందజేస్తామన్నారు. 72టన్నుల యూరియాను మండల రైతులకు రైతు వేదికల వద్ద యూరియాను ఏఈవో, సొసైట్ ఇన్‌చార్జిలతో సహకారంతో అందజేస్తామన్నారు. రైతులకు సరిపడా యూరియా అందజే స్తామని, ఎవరు కూడా ఆందోళన చెంద వద్దని సూచించారు.

అటవీ గ్రామాలకు ఊరట..

- బీటీ రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- 12 కిలోమీటర్ల మేర పనులకు రూ. 25 కోట్లు మంజూరు
- ప్రభుత్వం నిర్ణయంతో తీరనున్న ప్రజల కష్టాలు
- మంచిర్యాల-ఆసిఫాబాద్ జిల్లాలను కలిపేలా రోడ్డు నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న రెండు జిల్లాల గిరిజనులు



ప్రభుత్వం అనుమతిచ్చిన మంచిర్యాల జిల్లా దండేపల్లి-గుండాల రోడ్డు

మంచిర్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో బీటీరోడ్డు మంజూరుచేసి, తమ దశాబ్దాల కలను సాకారం చేసిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచి ర్యాల జిల్లా దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోనిఊట్ల నుంచి కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గుండాల వరకు దట్టమైన అడవిలో రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా వేడుకుంటున్నారు. ఇప్పటివరకు ఆ మార్గంలో సరైన రవాణా సౌకర్యం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వారి బాధలు అనేకం. కాలి నడకన వెళ్లేందుకు కూడా మెటల్‌రోడ్డు అనుకూలించే పరిస్థితులు లేవు. ప్రజల అవస్థలు దృష్టిలో ఉంచుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గతంలో మెటల్‌రోడ్డు వేసినప్పటికీ కాలక్రమంలో అది గుంతలుపడి, రాళ్ల తేలడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గుండాల గ్రామం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్నప్పటికీ అక్కడి ప్రజలకు ఏ అవసరం వచ్చినా సమీపంలో ఉన్న మంచిర్యాల జిల్లాకే వస్తుంటారు. వైద్యం, నిత్యావసర సరుకుల కొనుగోలు, ఇతరత్రా అవసరాలకోసం గుట్టమీద నుంచి కాలినడకన, ద్విచక్ర వాహనాలు, ఎడ్లబండ్లపై దట్టమైన అటవీ ప్రాంతం గుండా దండేపల్లి, మ్యాదరి పేట, లక్షెట్టిపేట, మంచిర్యాల వరకు ప్రయాణం సాగిస్తారు. రోడ్డుసౌకర్యం బాగాలేక అత్యవసర సమయాల్లో వైద్య చికిత్సలకోసం రోగులను మంచంపై పడుకోబెట్టి తరలించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రెండు గ్రామాలు గిరిజనప్రాంతాలు కావడంతో ఇంతకాలం నాయకులు, అధికారులు సైతం పెద్దగా దృష్టి సారించలేదు.

రూ. 25 కోట్లు మంజూరు...

ఊట్ల-గుండాల గ్రామాలను అనుసంధానం చేసేలా బీటీరోడ్డు నిర్మించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఫిబ్రవరిలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్‌కు లేఖ రాశారు. దండేపల్లి మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి కర్నపేట, ఊట్ల మీదుగా గుండాల వరకు 12 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టవలసిన...

(తరువాయి 7లో)

గిరిజనులకు ఎంతో ఉపయోగకరం...



దండేపల్లి నుంచి గుండాల వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం శుభపరిణామం. గిరిజన గ్రామాలకు ఎంతో ఉపయోగం. గత ప్రభుత్వా లు ఏనాడూ ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదు. గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వానికి సమస్యను విన్నవించాను. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సైతం నిధులు మంజూరులో తనవంతు కృషి చేయ డంతో ఎట్టకేలకు మోక్షం లభించింది.

- కొట్నాక తిరుపతి, రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్

మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మున్సి పాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. ఆదివారం కలెక్టర్ చాంబర్‌లో మందమర్రి, క్యాత నపల్లి, చెన్నూరు మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో పన్నులను వందశాతం వసూలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు.

అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకులు, ఇతర పనులను వేగవం తంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి, క్యాతనపల్లి మున్సిపల్ కమీషనర్‌లు రాయలింగు, రాజు, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి వేదికపై పూర్వ విద్యార్థులు

మంచిర్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆద్యంతం అలరించింది. ఆదివారంతో తాము పదోతరగతి పూర్తిచేసి 50ఏళ్ల పూర్తి కావస్తున్నందున మధురజ్ఞాపకంగా గోల్డెన్‌జూబ్లీ వేడుకల సమ్మేళనం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన వేడుకల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ 1973-74 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులంతా హాజరై తమ తీపి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు తమకు విద్యాబోధన గావించిన ఉపాధ్యాయులు ఎస్ నర్సయ్య, సీ కాంతయ్య, డి నారాయణరావు, ఎస్ సూర్య నారాయణలు అందుబాటులో ఉండటంతో వారికి సాదర స్వాగతంపలికి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి స్థానికంగాఉన్న మంగీలాల్ సోమాని (మున్సిపల్ మాజీ చైర్మన్), గుండా సుధాకర్ (ప్రముఖ వ్యాపారవేత్త), పి అనిల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, జుబేర్ అహ్మద్‌లు నాయకత్వం వహించారు.

మెడికల్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయం

● డీసీపీ భాస్కర్



మందులు అందజేస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సేవా భావంతో మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమని మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ క్లబ్ ఆవరణలో మంచిర్యాల లయన్స్‌క్లబ్ చారిటబుల్ ట్రస్టు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కరీంనగర్ రెనె ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంపును నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో 460 మందికి వివిధ రకాల జబ్బులకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించారు. డీసీపీ భాస్కర్ క్యాంపును ప్రారంభించి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సేవాభావంతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీని ద్వారా ప్రజలకు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కలుగుతుందన్నారు. పేద ప్రజలు కొన్ని రోగాలకు వైద్య సేవలు ఉన్నప్పటికీ వారికి సరైన అవగాహన లేక ఆసుపత్రిలో వైద్యం చేసుకోవడం ఆర్థిక భారం కావడంతో ఆసుపత్రికి వెళ్లలేకపోతారని, అటువంటి వారికి ఇలాంటి మెడికల్ క్యాంపులు మనోధైర్యం కల్పిస్తాయన్నారు. అనంతరం నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, సత్య పాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రెనె ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. పలు విభాగాల వైద్యులతో పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు, రెనె ఆసుపత్రి ప్రతినిధులు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటి చుట్టు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అప్పుడే వైరల్ జ్వరాలు రాకుండా అరికట్టే అవకాశం ఉంటుంద ని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత ప్రజల కు సూచించారు. 'ఆంధ్రజ్యోతి' ఇంట ర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

డీఎంహెచ్‌వో : వర్షాల ప్రభావం వల్ల దోమకాటుతో డెంగ్యూ, మలేరియా, కలుషిత తాగునీరు వల్ల టైఫా యిడ్ జ్వరాలు వస్తున్నాయి. ఇప్పటికీ 105 డెంగ్యూ కేసులు, రెండు మలేరియా కేసులు, 3వేలకు పైగా సా ధారణ జ్వరాలతో ఆసుపత్రికి వచ్చారు. వారికి సరైన వైద్యం అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : జ్వరాలతో ఎక్కువ మంది ఆస్పత్రు ల్లో చేరుతున్నారు. ఆస్పత్రుల్లో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా?

డీఎంహెచ్‌వో : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేకంగా జ్వరాల వార్డును ఏర్పాటు చేశాం. అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. వారికి మంచి చికిత్స అందిస్తున్నాం. జ్వరాల ని వారణకు ఆశాలతో, ఏఎన్ ఎంలతో ట్రైనింగ్ నర్సులతో ఫీవర్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎక్కువ కేసులు ఉన్న ప్రాంతాలను గుర్తించి వైద్యం అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎంహెచ్‌వో : దోమల నివారణ కోసం కాలనీ పరిసర ప్రాంతాల్లో, మురికి కాలువల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపాలిటీ గ్రామ పం చాయతీ అధికారులకు దోమల నివారణకు చేపట్టే చర్యలు క్లోరినేషన్‌పై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం. కలుషిత తాగునీటి వల్ల డెంగ్యూ, తదితర జ్వరాలు ప్రబలుతున్నట్లు గుర్తించాము. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు కళాబృందాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంటి పరిసరాల్లో నీటినిల్వ ఉండకుండ ఎప్పటికప్పుడు కుండలలో, దోమలు పెరగకుండా నీ టితొట్టిలో నీరు నిల్వ ఉండకుండా చూస్తున్నాం. దోమలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఆర్థిక సాయం అందజేత

జన్నారం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి) : చిన్ననాటి స్నేహితుడికి ఏకమై కష్టకాలంలో బాసటగా నిలిచారు. మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన కవటం భూమన్న ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నా డని తెలుసుకున్న 1987-88పదోతరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా కలిసి బాధితుడికి రూ.28వేలు పోగుచేసి అందజేశారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న స్నేహితుడికి సహాయం చేయడం బాధ్యత అన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, హరిక్రిష్ణ, సుభాష్, మణి పాల్గొన్నారు.

యూరియా కష్టాలు తీరేనా..?

● సరిపడా సరఫరా చేస్తున్నామంటున్న వ్యవసాయాధికారులు

7

దాడి కేసులో ఐదుగురి అరెస్టు

తాండూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జనం రోజున ఓ యువకుడిపై దాడి జరిగిన కేసులో ఐదుగురు యువకులను ఆదివారం అరెస్టు చేసినట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 5న తాళ్లపల్లి సృజన్ గౌడ్ అనే యువకుడిపై తాండూర్ ఐబీలో దాడి చేసి గాయపర్చారని, సృజన్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దాడి చేసిన సుభద్ర కాలనీకి చెందిన అనిల్, సాయి, రాజు, నరేష్, హరిలను అరెస్టు చేశామని, మరో నిందితుడు నిఖిల్ పరారీలో ఉన్నాడని తెలిపారు. వీరిపై రౌడీషీట్ తెరుస్తామన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాపల్‌ఏరియాకు చెందిన సుక్‌లాల్‌యాదవ్ (31) అనే కూలీ ఆదివారం ఉదయం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే చత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన సుక్‌లాల్‌యాదవ్ నాలుగేళ్ల క్రితం మందమర్రికి వచ్చాడు. యాపల్ ఏరియాలో గది అద్దెకు తీసుకుని ఉంటూ మేస్త్రీ పనులు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంట్లో భోజనం చేస్తున్న సమయంలో కూలర్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్ కొట్టి కింద పడిపోయాడు. కుటుంబీకులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో సీపీఆర్ చేసినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్టు

బెల్లంపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాళ్లగురిజాల రైతు వేదికలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాళ్లగురిజాల సీఐ హనుక్ అన్నారు. ఆదివారం తాళ్లగురిజాల పోలీసు స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ తాళ్లగురిజాల రైతు వేదికలో జులై 3న తాళం పగులకొట్టి వీడియోకాన్ఫరెన్స్‌కు సంబంధించిన ఎల్ ఈడీ టీవీతో పాటు ఇతర వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. తాళ్లగురిజాల ఏఈవో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని పోచమ్మగడ్డ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు చేపడుతున్న సమయంలో ఆటోలో ఓ వ్యక్తి టీవీతో పాటు సౌండ్ బాక్సులను తీసుకెళ్తున్నాడు. అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు ఆటోను ఆపారన్నారు. ఆటోలో ఎల్‌ఈడీ టీవీతో రెండు సౌండ్ బాక్సులు ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారని ఆటోలో ఉన్నవారిని విచారించగా గురిజాల రైతు వేదికలో దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడినవారిలో కన్నెపల్లి మండలం జన్కపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ నసీమ్, బెల్లంపల్లి పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన వర్మ శైలేశ్ అనే వ్యక్తులను అరెస్టు చేసి వీరి నుంచి ఎల్‌ఈడీ టీవీతోపాటు రెండు సౌండ్ బాక్సులతో పాటు ఒక సీపీయు, ఒక అంప్లిఫైర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.. ఈ సమావేశంలో ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ అలీ, కానిస్టేబుల్ అరుణ్‌లు ఉన్నారు.

సామాజిక సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివనూర్‌లో ఇంత వరకు విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడు ఉద్దవ్ సామాజిక సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని శివనూర్ ఉపాధ్యాయుడు ఉద్దవ్ పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ఉద్దవ్ లాంటి ఉపాధ్యాయులు ఉపాధ్యాయ వృత్తితో పాటు సామాజిక సేలు అందించడం అభినందనీయమన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు సైతం పాల్గొని ఉద్దవ్‌ను సన్మానించారు. అనంతరం మండలంలోని జంగాం, సుభాష్‌గూడ తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో తమకు మంచీ నీరు అదడం లేదని, నీటి కొరత ఏర్పడిందని గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. తాగు నీటి సదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, ఉపాధ్యక్షులు ఆత్రం శంకర్, ముసా, నర్సింగ్ రాందాస్, గణపత్, కాంగ్రెస్ నాయకులు మేస్రాం అంబాజీ పాల్గొన్నారు.

సన్న బియ్యం అక్రమ రవాణా

● ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న అక్రమార్కులు ● నిఘా పెంచితేనే అడ్డుకట్ట



దహెగాంలో పట్టుకున్న బియ్యం పంచనామా చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు(ఫైల్)

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో సరఫరా చేస్తున్న సన్నబియ్యం అక్ర మ రావాణా చేస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుం టున్నారు. కుమరం భీ జిల్లాలోని ప్రధానంగా రైసు మిల్లులు అధికంగా ఉన్నటువంటి కాగజ్‌నగర్‌లో మిల్లర్లు సన్నబియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో దొడ్డు బియ్యాన్ని తరలించగా ప్రభుత్వం సన్నబియ్యం ప్రవేశ పెట్టి ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తోంది. అయితే రైసు మిల్లర్లు, రేషన్ డీలర్లు, బియ్యం స్మగ్లర్లు ఒక్కటయి దందా వదలకుండా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఆహార భద్రత కార్డుల ద్వారా ఉచితంగా బియ్యాన్ని అందిస్తుండగా కిలోకి రూ. 18 నుంచి 20కు కొనుగోలు చేసి డీలర్ల వద్ద నుంచి భారీ ఎత్తున దళారులు తరలిస్తున్నారు. అక్కడి నుంచి మహారాష్ట్రకు లేదా కొన్ని రైసు మిల్లులకు తరలిస్తున్నారు. ఇటీవల దహెగాం మండలంలోని ఓ రైసు మిల్లులో సన్నబియ్యాన్ని డీటీ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు స్వాధీనం చేసుకోగా, సిర్పూర్(టి) మండలంలోని ఓ రైసు మిల్లులోనూ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచగా పట్టుబడ్డ విషయం మచ్చు కు మాత్రమే ననే ఆరోపణలు న్నాయి. జిల్లా వ్యాప్తంగా 30కి పైగా రైస్ మిల్లులుంటే కేవలం ఆసిఫా బాద్ డివిజన్‌లో ఒకటి, రెండు మినహాయిస్తే మిగిలినవన్నీ కాగజ్‌నగర్ డివిజలోనే అధికంగా ఉన్నాయి. కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూరు, పెంచికలపేట, దహెగాంతో పాటు ఆయా మండలాల్లో పలుసార్లు మిల్లర్ల మాయాజాలంతో అక్రమంగా దాచిన నిల్వలు దొరికాయి. ఈ బియ్యాన్ని అనుకూ లంగా ఉన్నప్పుడు సరిహద్దులు దాటిసున్నారు. జిల్లా వ్యాప్తంగా రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కాగజ్‌నగర్ డివిజన్ కేంద్రంగా మారింది. బియ్యం పట్టుబడ్డప్పుడు కేసులు నమోదు చేయా ల్సిన కొంత మంది అధికారులు కేసుల తీవ్రత తగ్గించడంతో దందాకు అడ్డుకట్టపడడం లేదనే విమర్శలున్నాయి. ప్రతీ నెల 10వేల మందికి పైగా లబ్ధిదారులు బియ్యం తీసుకోకపోవడంతో ఈ బియ్యం కార్డులు అసలువా? నకిలీవా తేల్చాల్సి ఉంది.

● డీలర్లే సూత్రధారులు..

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రేషన్ దుకాణా లుండగా కొంత మంది డీలర్ల వద్ద నుంచి సన్నబియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. అయితే ప్రతినెల షాపులకు వచ్చే లబ్దిదారులకు బియ్యం కావాలా డబ్బులు కావాలా అని అడిగే మరీ వేలి ముద్రలు వేసుకొని బియాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని వ్యాపారులకు ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొనుగోలు చేసిన వ్యాపా రులు పక్కనేఉన్న మహారాష్ట్రతో పాటు ఇతర పనులు వినియోగించు కుంటున్నారనే ఆరోపణలున్నాయి. అయితే ఎన్‌ఫోర్స్ మెంటు అధికా రులు, సిబ్బంది అడపాదడపా దాడు లు చేస్తున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు చేసిన దాఖలాలు ఉన్నప్పటికీ జిల్లాలోని కొంత మంది అధికా రుల మెతక వైఖరి అనుమానాలకు తావిస్తోంది. జిల్లావ్యాప్తంగా సుమారు 314పైగా రేషన్ దుకాణాలుండగా, 1,41,904 రేషన్ కారులు, 4.48 లక్షల లబ్ధిదారులున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తుండడంతో కాస్త విని యోగం పెరిగినా వినియోగించేందుకు ఇష్టపడని లబ్ధిదారులు బియ్యాన్ని విక్రయిస్తున్నారు. దీంతో సన్న బియ్యాన్ని కూడా వదలకుండా రైస్ మిల్లర్లు, దళా రులు, రేషన్ డీలర్లు కుమ్మక్కై సొమ్ము చేసుకుంటు న్నారు. అధికారులు నిఘా తీవ్ర తరం చేస్తేనే సన్నబి య్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

కాగజ్‌నగర్‌లో మరిన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్



యశ్వంత్‌పూర్ సూపర్ ఫాస్ట్ రైలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో మరిన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ ఇచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. గోరఖ్‌పూర్-యశ్వంత్‌పూర్ సూపర్ ఫాస్ట్ రైలుకు కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం హాల్టింగ్‌ను రైల్వే అధికారులు ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే హరీష్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మిఠాయిలను పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో మరిన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆగేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ నెల 18న వందేభారత్ సూపర్ ఫాస్ట్ హాల్టు కాగజ్‌నగర్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో టెలికాం అడ్వం యిజరీ కమిటి సభ్యుడు ప్రభాకర్ గౌడ్, బీజేపీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్ర చారి, మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్, అరుణ్ లోయా, చిలువేరు ప్రవీణ్; పవన్ బల్దువా, చిప్పకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బ్యాండు వాయిద్యా కళాకారులకు సాంస్కృతిక గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ బ్యాండు వాయిద్యా కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బ్యాండు కళాకారుల పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు. బ్యాండు కళాకారులకు బడ్జెట్‌లో కేటాయింపు జరుపకుండ సంక్షేమాన్ని విస్మరిస్తుం దన్నారు. సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావలన్నారు. ప్రమాదంలో మరణించిన కళాకారులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బ్యాండు కళాకారుల గ్రూపులకు రూ. 5 లక్షల చొప్పున బ్యాంకు స్యూరిటీ లేకుండా రుణాలు అందించాలని కొరారు. శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ఆధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, మురళీ, నాయకులు తిరుపతి, సమ్మయ్య, శ్రీనివాస్, కృష్ణ, ధర్మయ్య, రాజేశ్వర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాల్సిందే



నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడలను తొలగించే దాకా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తుడుం దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోచయ్య రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక విజయ్‌కుమార్ అన్నారు. స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ముఖ్య సమావేశంలో జిల్లా, మండలాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1976లో అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా విద్య పరంగా అప్పటి రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాల కోసం వెనుకబడిన వారు అనే నెపం తీసుకు వచ్చి కేవలం తాత్కాలికంగా డీఎన్‌టీ(డీనోటిఫైడ్ ట్రైబ్)లుగా అవకా శం ఇస్తే అదే అదనుగా చూసి ఎస్టీలుగా చెలమణి అవుతూ రాష్ట్రంలో ఆదివాసీలకు అందించాల్సిన అభివృద్ధి ఫలాలు రిజర్వేషన్లు అన్ని లంబాడీలే అను భవిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ నాయకులపై లంబాడీ నాయకులు విమర్శలు చేస్తే ఉర్కునేదిలేదన్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే దాకా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఉద్యమ కార్యాచరణ ప్రకారం దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. అక్టోబరు 6న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాదయాత్ర ప్రారంభిస్తా మని అన్నారు. అక్టోబరు 15న అన్ని మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తామని అన్నారు. అక్టోబరు 20న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, అక్టోబరు 30న ఐటీడీఏ కార్యాలయాల వద్ద వినతి పత్రాలను అందజేస్తామని చెప్పారు. నవంబరు 9న వరంగల్‌లో భారీ బహిరంగసభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డిసెంబరు 9న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో తుడుం దెబ్బ నాయకులు కోవ విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, గణేశ్, రవిందర్, నర్సింగ్‌రావు, మోతిరాం, ప్రభాకర్, రాజేందర్, బాపురావు, రమేష్, పుష్పరాణి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్ నార్సింగలో నిర్వహించే ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

కాగజ్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 15వ విడుత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కోట ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పనులపై నిర్వహించిన తనిఖీలపై చర్చ ఉంటుందని, అలాగే క్షేత్ర స్థాయి నివేదికలు కూడా అందజేస్తారని ఎంపీడీవో తెలిపారు.

సొంతింటికే కార్మికుల మొగ్గు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు సొంతిల్లు కావాలంటున్నారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి తెలిపారు. సొంతింటి పథకం కోసం ఇటీవల గనులు, డిపార్టుమెంట్లపై బ్యాలెట్ ఓటింగ్ చేపట్టగా ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఓట్లను లెక్కించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిలో మెజార్టీ కార్మికులు సొంతింటి పథకం అమలు చేయలని ఓట్లు వేశారని తెలిపారు. పాత్రికేయుల సమక్షంలోనే యాజమాన్యానికి, గుర్తింపు సంఘానికి తెలియడం కోసమే ఓట్లను లెక్కిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సొంతింటి పథకం కార్మికులకు అమలు చేయాలన్నారు. సమావేశంలో నాగరాజు గోపాల్, వెంకటస్వామి, రాజేందర్, రంజిత్, దేవదాసు, రామగిరి రామస్వామి, ఐలయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా కోసం పోరుబాట



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగేరణి ఉద్యోగులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లాభాల వాటా కోసం తమయూనియన్ పోరుబాట కార్యక్రమాన్ని రూపొందిం చిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి తెలిపారు. ఆదివారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు కావస్తున్నా సంస్థకు ఎంత లాభాలు వచ్చాయో ఇంత వరకు ప్రకటించక పోవడం దారుణమన్నారు. లాభాల వాటా 35 శాతం చెల్లించాలని అన్ని జీఎం కార్యాలయాల ముందు ఈ నెల 15న ధర్నా చేపట్టనున్నామన్నారు. కార్మికులు ప్రతి సంవత్సరం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూనే ఉన్నారని, అయినా వారికి మెరుగైన సౌకర్యాలు అందడం లేదన్నారు. సింగరేణిలో అనుకోని ప్రమాదాలు జరిగితే వైద్యానికి హైద్రాబాద్‌కు వెళ్లే పరిస్థితులు ఉన్నాయన్నారు. హైద్రాబాద్‌లో కార్పొరేట్ ఆసుపత్రి కట్టడాన్ని హర్షిస్తున్నామని, వెంటనే ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. గనుల వద్ద అందుబాటులో వైద్యులను ఉంచాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని కార్మికులకు నాణ్యమైన రక్షణ పరికరాలను అందించాలన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ ముందుం టుంద న్నారు. లాభాల వాటా కోసం చేపట్టే ధర్నాలో కార్మికులందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎస్. వెంకటస్వామి, అల్లి రాజేందర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



హామీలు నెరవేర్చని సంఘాలు



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవ సలహాదారు శ్రీనివాస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను గుర్తింపు, ప్రాతినిధ్య సంఘా లు నెరవేర్చలేదని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం(జీఎల్‌బీకేఎస్-ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర గౌరవ సలహాదారు టి శ్రీనివాస్ ఆరోపించారు. గోదావరిఖనిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో అన్ని ఏరియాలకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో జీఎల్‌బీకేఎస్ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, నాయకులు ఎ. వెంకన్న, డి. బ్రహ్మానందం, ఎండి. రాసుద్దీన్, నాగేశ్వరరావు, నరేష్, టి. శ్రీనివాస్, మల్లేష్, నర్సింగం, రాజేశం, సిద్ధయ్య, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆరోపణలు చేయడం సరికాదు'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఓటమి భయంతో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్‌ప్రసాద్ ఆరోపణలు చేస్తున్నారుని హెచ్‌ఎంఎస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు వి అనిల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెఎంఎస్, తెలంగాణ జాగృతి కలయికను జనక్ ప్రసాద్ జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. గతంలో ఒక యూనియన్‌కు గౌరవ అధ్యక్షురాలిగా ఉంటూ 20 వేల మందికి వారసత్వ ఉద్యోగాలు ఇప్పించిన ఘనత కల్వకుంట్ల కవితదని వారు తెలిపారు.

వారంలోగా లాభాల వాటాపై ప్రకటన

శ్రీరాంపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వారంలోగా యాజ మాన్యం నుంచి లాభాల వాటాపై ప్రకటన వెలువడుతుందని ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్.బలరాంతో సమావేశమై సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. 12న ఉప ముఖ్యమంత్రితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో లాభాల వాటాతో పాటు 15 డిమాండ్లపై చర్చించగా, సానుకూల స్పందన లభించిందన్నారు. అలాగే 13న శ్రీధర్ బాబును కలిసి లాభాల వాటా గురించి ప్రస్తావించగా, వారంలోగా ప్రకటన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

బీఎంఎస్ పోరాటం వల్లే పరిహారం పెంపు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏబీకేఎంఎస్-బీఎంఎస్ పోరాటం వల్లనే గని ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి పరిహారం పెంచారని బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి, జేబీసీసీఐ సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.తాము దీర్ఘకాలిక పోరాటం చేశామని రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య తెలిపారు.

లాభాల వాటాకు మోక్షం లేదు



మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో గత ఆర్థిక సంవత్సరంముగిసి ఆరు నెలలు కావస్తున్నా ఇంత వరకు లాభాల వాటాకు మోక్షం లేదని, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల వైఫల్యానికి ఇది నిదర్శనమని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు ప్రాతినిధ్యసంఘాలు విఫలమయ్యాయన్నారు. లాభాల వాటా ఇంత వరకు ప్రకటించక పోవడం దారుణమన్నారు. తమ యూనియన్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కారుణ్య నియామకాలపై చేసిన ఆరోపణలపై గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు జవాబు చెప్పాలన్నారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ కాంట్రాక్టు కార్మికులకు ఎంత వరకు మేలు చేశారో చెప్పాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఎంత వేతనం పెంచి ఇప్పించారో జవాబు చెప్పాలన్నారు. తమ యూనియన్ కార్మికుల సంక్షేమానికి ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. ఈసమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్, నవీన్, కార్తీక్,చంద్రశేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'సాగును అడ్డుకుంటున్న అటవీ శాఖ అధికారులు

వేమనపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తరాల నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను సాగు చేసుకోనివ్వకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాజారాం గ్రామంలో పోడు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేమనపల్లి మండలంలో గిరిజనులు, దళితులు తర తరాల నుంచి పోడు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారనానరు. కొంత కాలం నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను సాగు చేయనివ్వకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రాజారం గ్రామంలో 40 మందికి పట్టాలు ఉన్నా అటవీ శాఖ అధికారులు వీరిని సాగు చేసుకోకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా టైగర్ జోన్ పేరుతో జీవో 49ని తెచ్చి ఆదివాసీలపై అటవీ శాఖను ఉసిగొలిపి పోలీసులతో దాడులు చేయిస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు సత్యం, భీమయ్య, నాగయ్య, పురుషోత్తం, శ్రీనివాస్, గంగమ్మ, శంకరక్క, మారక్క, ముత్తయ్య, కనకయ్య, సమ్మక్క పాల్గొన్నారు.

స్థానికత పేరుతో మెడికల్ సీటు కోల్పోతున్న విద్యార్థిని

ఆందోళనలో తల్లిదండ్రులు


గొడిసెల లాస్య(ఫైల్)

కాసిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి వరకు తెలంగాణలో చదివి, ఇంటర్ చదువు ఏపీలోని విజయవాడలో కొనసాగించడంతో స్థానికత పేరుతో మెడికల్ సీటు కోల్పోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాసిపేట మండలంలోని సోమగూడెంకు చెందిన గొడిసెల లాస్య పదవ తరగతి వరకు తెలంగాణలో విద్యాభ్యాసం చేసింది. కానీ ఇంటర్ మాత్రం విజయవాడలో చదు వుకుంది. నీట్ పరీక్షలో 408 మార్కులు సాధించి మంచిర్యాంకు సాధించింది. కానీ ప్రభుత్వ విధానం వల్ల స్థానికతతో మెడికల్ సీటు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ నెల 11న ప్రారంభమైన నీట్ కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే నాన్ లోకల్‌గా చూపెడుతోందని వాపోతున్నారు. ఈ నెల 16న కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. కానీ రెండేళ్లు వేరే రాష్ట్రంలో చదువుకున్నందుకు నాన్ లోకల్ పేరుతో మెడిసిన్ చదువుకు దూరం చేయడం బాధాకరమని, తెలంగాణ ప్రభుత్వం స్పందించి మెడిసిన్ సీటు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్కంఠగా సాగిన రామాలయం చైర్మన్ ఎన్నిక


రాజేశ్వర్‌రెడ్డి (ఫైల్)

భీమారం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో ఆదివారం రామాలయం చైర్మన్ ఎన్నిక ఉత్కంఠగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. చైర్మన్ బరిలో 9 మంది నిలువగా ఇద్దరు విత్ డ్రా కావడంతో ఏడుగురు పోటీలో నిలిచారు. రహస్య ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నికలు కొనసాగాయి. ఓటర్లుగా ప్రతి సామాజిక వర్గం నుంచి ఐదుగురు సభ్యులు పాల్గొని ఓట్లు వేశారు. 80 ఓట్లు పోల్ కాగా, ఒక ఓటు చెల్లలేదు. ఎన్నికల్లో పోటు రాజేశ్వర్‌రెడ్డికి 35 ఓట్లు రా గా, ఆవుల సురేష్‌కు 14 ఓట్లు వచ్చాయి. దీంతో చైర్మన్‌గా పోటు రాజేశ్వర్‌రెడ్డి గెలిచారు. ఎన్నికల అధికారిగా డిప్యూటీ తహసీల్దార్ అంజమ్మ, ఎన్నికల నిర్వహకులుగా శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్, భీమారం, శ్రీరాంపూర్ ఎస్ఐలు శ్రీధర్, శ్వేత, సంతోష్‌లు వ్యవహరించారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో విజయవంతం చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కొక్కిరాల సురేఖ

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫొటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు అప్పాసు రామన్న అన్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ ఈ నెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటోట్రేడ్ ఎక్స్‌పో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తిరుపతి, పట్టణ అధ్యక్షురాలు రాజబాబు, గౌరవ అధ్యక్షులు మల్లీఖార్జున్, నాయకులు సురేశ్, దేవి రవీందర్, సతీష్ పాల్గొన్నారు.

యూరియా కష్టాలు తీరేనా..?



హాజీపూర్ : పడ్తన్‌పల్లి పీఏసీఎస్‌లో యూరియా కోసం రైతుల క్యూలైన్ (ఫైల్)

- సరిపడా సరఫరా చేస్తున్నమంటున్న వ్యవసాయాధికారులు
- కేంద్రాల వద్ద బారులు తీరుతున్న రైతులు
- ధర్నాలు, రాస్తారోకోలకు ఆందోళనకు దిగుతున్న వైనం

హాజీపూర్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): రైతు పొలం పండాలంటే విత్తనం, నీరు, ఎరువులు సమకాలికంగా ఉండాలి. ప్రభుత్వాలు ఈ దిశగా ఏర్పాటు చేయాలి. వాటిలో ముఖ్యమైనవే యూరియా. కానీ ఈ రోజుల్లో రైతు చేతిలో విత్తనం ఉన్నా యూరియా లేక రైతు ఆగమవుతున్నాడు. ప్రభుత్వాలు మాటలదాకే పరిమితమై చర్యల విషయంలో అలసత్వం వహిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. జిల్లాలో ఎక్కువగా వరి, పత్తి పంటలో సాగు చేస్తున్నారు రైతులు. కానీ ఈ సీజన్‌లో ఆది నుంచి రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. యూరియా ఇవ్వాల్సింది కేంద్ర ప్రభుత్వమే అంటూ రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యమంటూ రోజులు సాగదీస్తూ రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందుల్లో పెడుతున్నాయి. నానో యూరియాను ప్రోత్సహిస్తున్నా కాని అది పంటలపై ప్రభావం చూపడం లేదని, దిగుబడి రావడం లేదంటూ రైతులు వాపోతున్నారు.

పడిగాపులు కాస్తున్న రైతులు...

ప్రతి రోజు యూరియా కేంద్రాల వద్ద వందల వేల సంఖ్యలో రైతులు ఎరువులకోసం గంటలతరబడి క్యూ లైన్‌లలో నిలబడుతున్నారు. ఎరువులు అందకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో ఏం చేయాలో అర్థంకాని రైతులు రాస్తారోకోలు, ధర్నాలు చేస్తూ రోడ్లపై బైఠాయిస్తూ తమ బాధలను వ్యక్తపరుస్తున్నారు.

జిల్లాలో 3.20లక్షల ఎకరాల్లో సాగు...

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 18 మండలాల్లో 3.20 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వరి 1.50లక్షలు, పత్తి 1.60లక్షల ఎకరాలు కాగా ఈ పంటలకు ఈ దశలో యూరియా అవసరం ఎంతైనా ఉంది. దీంతో రైతులు రెండో దఫా మందులు వేసే సమయం కావడంతో సరిపడా యూరియా కేటాయించకపోవడంతో యూరియాకోసం సప్లయి కేంద్రాల వద్ద గంటల తరబడి ఎదురు చూస్తున్నారు. జిల్లాకు ఈ ఏడాది ఇప్పటి వరకు 28వేల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతానికి 25వేల మెట్రిక్‌టన్నుల యూరియా జిల్లాకు వచ్చింది. జిల్లాలో ఎంత యూరియా అవసరం పడుతుందో అని ముందే గ్రహించకపోవడం దానికి తగ్గట్టుగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వకపోవడంతోనే జిల్లాలో యూరియా కొరత ఏర్పడుతున్నట్లు రైతుసంఘం నాయకులు చెబుతున్నారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం వెంటనే అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రానికి సరిపడా కోటా కేటాయిం చేందుకు కేంద్రప్రభుత్వం ముందుకు రావాలి.

ఉత్పత్తి యూనిట్లను వేగంగా పునరుద్ధరించాలి. బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించేందుకు ప్రత్యేకవిజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేస్తే యూరియా రైతుకు అందే అవకాశం ఉంటాయని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపైఒకరు తమ బాధ్యత కాదంటూ విమర్శచేసుకోవడం మాని రైతులకు యూరియా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని రాజకీయాలు పక్కనపెట్టాలని రైతుసంఘం నాయకులు చెబుతున్నారు.

కొరత ఎందుకు...

యూరియా కొరతకు ప్రధానంగా దేశీయంగా ఉత్పత్తి చేసే యూనిట్లలో ప్రాసెసింగ్ అడ్డంకులు, అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతుల ఆలస్యం, కేంద్ర ప్రభుత్వం తరుపున సరిపడని కేటాయింపులు, కొన్ని ప్రాంతాల్లో నిల్వలు తక్కువగా ఉండడం, ఇతర అంశాలు ఉన్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా రాష్ట్రానికి అవసరమైన మొత్తంలో యూరియా కేంద్రం నుంచి అందకపోవడమే కారణమంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తున్నారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు...

- జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సురేఖ

రైతులు ఆందోళన చెందవద్దని రైతులకు సరిపడా యూరియా తెప్పించే ప్రయత్నాలు చేస్తున్నామని, జిల్లాకు ఇప్పటి వరకు 28వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 25వేల మెట్రిక్ టన్నుల యూరి యా వచ్చింది. 18 మండలాల్లో 55క్లస్టర్లలోని రైతు వేదికల్లో యూరియా సరఫరా చేసేందుకు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతానికిగాను 14 రైతు వేదికల్లో యూరియా సప్లై ప్రారంభించాం. మంగళవారం వరకు ప్రతి మండలానికి పది టన్నుల యూరియా సప్లై చేస్తాం.

కేంద్ర ప్రభుత్వం రాజకీయం చేస్తోంది...

- సంకె రవి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రనికి యూరియా కేటాయిం పుల్లో పక్షపాతం చూపిస్తుందని రాజకీయ ఎత్తు గడలతోనేజిల్లాకు సరిపడ యూరియా సప్లై చేయ డం లేదు. రైతులకు ఎంత యూరియా అవసరమో వ్యవసాయాధికారులు అంచనా వేసినగాని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై చిన్నచూపు చూస్తూ యూరియా సరఫరాను తగ్గిస్తుందని కేటాయింపుల్లో వ్యత్యాసం చూపిస్తుందన్నారు.

నాయకులకు స్టడీ టూర్ అవసరం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో కార్మిక సంఘాల నేతలకు ఇతర రాష్ట్రాల్లో బొగ్గు పరిశ్రమలపై అవగాహన కలగడానికి స్టడీ టూర్ ఎంతో అవసరమని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు, క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు మహానదీ కోల్‌ఫీల్డ్‌లో స్టడీ టూర్‌కు నాయకులతో కలిసి వెళ్లామన్నారు. మహానది కోల్‌ఫీల్డ్, నైనీ బ్లాక్‌లను సందర్శించామన్నారు.

'ప్రజలందరూ ఐక్యతతో ఉండాలి'

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో ముందుకు సాగాలని ముస్లిం మత పెద్దలు మహ్మద్ షాకీర్, సయ్యద్ ఆఫాన్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మదర్సా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టామన్నారు. సయ్యద్ హబీబ్, జావేద్‌ఖాన్, యాకూబ్, మాజిద్, తాజుద్దీన్, సంధాని పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

నెన్నెల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మైలారంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా ఆరోగ్య, వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వివిధ ప్రాంతాలకు చెందిన వైద్య నిపుణులు 260 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల గూర్చి వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. శుద్ధమైన నీరు తాగాలని చెప్పారు. తమ సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన సేవా కార్యక్రమాలు చేప డుతున్నామని నిర్వాహకులు చెప్పారు. న్యూరో ఫిజీషియన్ డాక్టర్ నవీన్‌కుమార్, నెన్నెల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, జనరల్ ఫిజీషియన్లు డాకర్ ప్రియాంక, డాక్టర్ తిరుపతి, డాక్టర్ మహేందర్, డాక్టర్ హారిక వైద్య సేవ లందించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రతినిధులు పాపి రెడ్డి, మండల కన్వీనర్ సేని వెంకన్న, మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, నాయకులు గురునాథం మల్లాగౌడ్, దండనాయకుల ప్రకాష్‌రావు, భజనా మండలి, సేవాదళ్ సభ్యులున్నారు

అంగన్‌వాడీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అంగన్ వాడీ యూనియన్(సీఐటీయు) కార్యదర్శులు భానుమతి, రాజమణి అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయు కార్యాలయంలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మంచిర్యాలలో ఉన్న మంత్రి గడ్డం వివేక్ ఇల్లు ముట్టడిని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. పీఎంసీ నిధుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను కేటాయించాలని ప్రీ ప్రైమరిని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని, పలు డిమాండ్లతో నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. నాయకులు దుంపల రంజిత్, దేవరాజులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలో పూడిక తీత

నెన్నెల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కుమ్మరివాగు ప్రాజెక్టు ఎడమ కాలువలో పూడికతో పాటు తుంగ నిండిపోవడంతో ఆయకట్టుకు నీరందడం లేదు. 50 ఎకరాల వరకు నీరు పారక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు మాజీ సర్పంచ్ తోట సుజాతశ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె ఆదివారం సొంత ఖర్చులతో పూడిక తీయించారు. కాలువలో అడ్డు తొలగడంతో నీరు పొలాల వరకు వస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పనులు చేయించిన మాజీ సర్పంచ్‌కు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

జ్వరాల బారిన హాస్టల్ విద్యార్థులు

కాసిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ హాస్టల్ విద్యార్థులు జ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్నారు. గత ఏడాది కాలంగా హాస్టల్ ఏఎన్‌ఎం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం పలువురు విద్యార్థినీలకు తీవ్ర జ్వర రావడంతో హాస్టల్ సిబ్బంది సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌లో ఏఎన్‌ఎంను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వారోత్సవాలను జయప్రదం చేయాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): 70 ఏళ్ల క్రితం బహుజన రాజ్యాధికారాన్ని తమిళనాడు గడ్డపై సాకారం చేసిన దళిత బహుజన ఉద్యమ మార్గదర్శి పెరియార్ రామస్వామి వారోత్సవాలను జయప్రదం చేయాలని, పూలే, పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుడిశెల శ్రీహరి అన్నారు. ఆదివారం వారోత్సవ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. సెప్టెంబరు 17న సాయంత్రం 4గంటలకు బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు మహనీయ విగ్రహాల వద్ద పెరియార్ రామస్వామి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. నాయకులు స్వామి, క్రిష్ణ, రవి, శ్రీధర్, చంద్రమౌళి, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

మైక్రో బయాలజీ విభాగంలో గోల్డ్‌మెడల్


అవార్డు అందుకుంటున్న డాక్టర్ అక్షయ

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): గాంధీమెడికల్ కాలేజీ హైదరాబాద్‌లో జరిగిన ఫార్మేషన్‌డే సందర్భంగా టీఎన్‌జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి కుమార్తె డాక్టర్ అక్షయ గోల్డ్‌మెడల్ అందుకుంది. బయాలజీ సబ్జెక్టులో కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకొని హౌజ్ సర్జన్ చేస్తున్న క్రమంలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరంలో మైక్రోబయాలజీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల పలువురు అభినందించారు.

భగవద్గీత ప్రచారం

లక్సెట్టిపేట, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మండలం జెండవెంకటాపూర్ గ్రామంలో ఆదివారం భగవద్గీతపై ప్రచారం చేసారు. భగవద్గీతపై ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కల్పించారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి లక్సెట్టిపేట కోడిమ్యాల కమిటీ అధ్యక్షులు రాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి'


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర కార్మిక, గనుల, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి కృషి చేస్తున్నారని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. ఆదివారం మందమర్రిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు మంత్రి కంకణబద్ధుడై పనిచేస్తున్నాడన్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారన్నారు. అలాగే పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మంచిర్యాల రైల్వే స్టేషన్‌లలో వందే భారత్ రైలు ఆగడానికి ఎంతో కృషి చేశారన్నారు. అలాగే పలు రైళ్ల హాల్టింగ్‌కు ఎంపీ కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమాలకు స్ఫూర్తి


నస్పూర్‌లో అమరవీరుల స్థూపానికి పూల మాల వేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

నస్పూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీసీసీ కార్నర్ వద్ద గల నర్సయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 77వ వార్షికో త్సవం సందర్భంగా ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో అమరులకు ఘన నివాళులు అర్పించారు. అమరవీ రుల స్థూపానికి జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అంతకు ముందు గోదావరి కాలనీ, నస్పూర్ కాలనీల్లో జెం డాలను ఎగురవేశారు. అనంతరం కాలనీల్లో షిర్కే సెంటర్ నుంచి నర్సయ్య భవనం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశం లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి సెప్టెంబరు 17ను విలీన దినోత్సవంగా నిర్వహించాలని, అమరుల త్యాగాలను గుర్తించాలన్నారు. 77వ వార్షికోత్సవాల ముగింపు సభను రావి నా రాయణరెడ్డి ఆడిటోరియంలో జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరభద్రయ్య, జోగుల మల్లయ్య, లింగం రవి, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, నగేష్, రాజేశ్వర్‌రావు. తంగళ్లపల్లి సురేష్, అంజనేయులు, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉద్యమాలకు స్ఫూర్తి అని సీపీఐ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని స్టేషన్‌రోడ్డు కాలనీలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రగొప్పదన్నారు. ఎంతో మంది నాయకులు తమ ప్రాణాలు అర్పించి పోరాటం కొనసాగించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నర్సయ్య, నాయకులు మిట్టపల్లి వెంకట స్వామి, పట్టణ కార్యదర్శి రాజమౌళి, కె ఎంయూ జాతీయ సమితి సభ్యులు బాపు పాల్గొన్నారు.

కాసిపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాగం మల్లేష్ అన్నారు. ఆదివారం సోమగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాటంలో 4500 మంది వరకు క మ్యూనిస్టులు ప్రాణాలు వదిలారని తెలిపారు. అమరుల త్యాగాలను ప్రపంచానికి తెలియజేసేందుకే ఈ నెల 17 వరకు రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సీపీఐ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు జాడి పోశం, కొముర య్య, దాగం రాజలింగు, నాగేశ్వర్‌రావు, పోశం, సుధాకర్, లింగమూర్తి, కుమార్, నారాయణ, రాజయ్య పాల్గొన్నారు.

అటవీ గ్రామాలకు ఊరట

(5వ పేజీ తరువాయి)

ఆవశ్యకతను ప్రభుత్వానికి తెలియజేశారు. ప్రభుత్వం ఐటీడీఏ పరిధిలోని 12 గిరిజన గ్రామాలను అనుసంధానం చేసేలా బీటీ రోడ్ల నిర్మాణానికి ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ నుంచి రూ. 465.55 కోట్లకు గత నెల 30న పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో నంబర్ 240 జారీ చేసింది. ఇందులో దండేపల్లి నుంచి గుండాల వరకు ప్రతిపాదించిన రోడ్డుకు రూ. 25 కోట్లు కేటాయించడంపై ఆయా గ్రామాల గిరిజ నులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- **పర్యాటక అభివృద్ధికి దోహదం..**

ప్రభుత్వ నిర్ణయంతో రోడ్డు నిర్మాణానికి మార్గం సు గమంకాగా, ఆ ప్రాంత పర్యాటక అభివృద్ధికి సైతం దోహదపడనుంది. రోడ్డు నిర్మాణం జరిగితే మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో ఉన్న ఊట్ల జలపాతం, పెద్దయ్య ఆలయం, సహ్యాద్రి పర్వతాలు (గుట్టలు), గుహలతోపాటు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని గుండాల జలపాతం పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. అలాగే దట్టమైన అటవీ ప్రాంతం కా వడంతో వణ్యప్రాణులు, రకరకాల పక్షులతోపాటు పచ్చని అటవీ ప్రాంతం పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి. ఎలాంటి రోడ్డు సౌకర్యం లేకున్నా... వర్షాకాలంలో ప్రతియేటా పర్యావరణ ప్రేమికులు పెద్దసంఖ్యలో ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. రోడ్డు నిర్మాణం జరిగితే పర్యాటకుల సంఖ్య మరింతగా పెరిగి, ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడే అవకాశం ఎంతైనా ఉంది.

చెరువులు... నిండు కుండలు

ఆనందంలో అన్నదాతలు


మత్తడి దూకుతున్న జోగాపూర్ మత్తడివాగు చెరువు

నెన్నెల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. జూన్, జులై నెలల్లో వర్షాలు లేక పోవడంతో జలాశయాలు నిండుతాయో లేదో అనే సందేహం నెలకొంది. ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో భారి వర్షాలు కురియడంతో చిన్న కుంటలు మొదలుకొని పెద్ద చెరువులు సైతం నిండు కుండల్లా మారాయి. ఇప్పటికి వర్షాలు కురుస్తుండటంతో చెరువులన్ని మత్తళ్లు దూకుతున్నాయి. జిల్లాలోని అన్ని చెరువులు పూర్తి స్థాయిలో నిండినట్టు ఇరిగేషన్ అధికారుల నివేదికలు చెబుతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, ర్యాలీవాగు, గొళ్లవాగు, నీల్వాయి జలాశయాలు సైతం పూర్తి స్థాయి నీటిమట్టంకలిగి ఉన్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.92 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

భీమారంలోని గొళ్లవాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 0.5675 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.4565 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. నీల్వాయి ప్రాజెక్టు సామర్థ్యం 0.846 టీఎంసీలు కాగా అందులో పూర్తి స్థాయి నీరు నిలువ ఉంది.

ఈ సీజన్‌లో సాగు నీటికి ఢోకా లేదు

జిల్లాలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో 840 చెరువులు ఉన్నాయి. వాటి కింద 62,138 ఎకరాల ఆయకట్టు ఉంది. కొంత ఆలస్యమైనప్పటికి ఆయకట్టు పొలాలన్ని వరినాట్లు వేసుకున్నారు. భూగర్భ జలాలు సైతం పెరగడంతో బోరు బావుల మోటర్లు నిరాటంకంగా నడుస్తున్నాయి. ప్రతి నిత్యం వర్షాలు కురుస్తుండటంతో కాలువల ద్వారా నీరు పెట్టే అవసరం అంతగా రాలేదు. దీంతో చెరువులు కళకళలాడుతున్నాయి. ఈ యేడు సాగు నీటికి ఢోకా లేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చివరి ఆయకట్టుకు సైతం నీరందుతుందని అంటున్నారు.


నిండా నీళ్లతో కళకళలాడుతున్న నెన్నెల కుమ్మరి వాగు చెరువు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి సాధ్యపడుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. ఆదివారం వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్ చేరగా ఎమ్మెల్సీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన నాయకులు ధరణి రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి పార్టీలో చేరానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగీర్ పాల్గొన్నారు.

- వేతనాల కోసం
- గిరిజన వసతిగృహాలు..
- ఆశ్రమ పాఠశాలల
- డెయిలీవేజ్ వర్కర్ల ఆందోళన
- డిమాండ్లు పరిష్కరించాలంటూ
- విధులకు దూరం
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతి
- భోజనం కోసం విద్యార్థుల అవస్థలు


కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న డెయిలీవేజ్ కార్మికులు

కార్మికుల సమ్మెబాట

ఆసిఫాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో పని చేస్తున్న దినసరి (డెయిలీ వేజ్) కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెబాట పట్టారు. వేతనాల పెంపుతో పాటు ఇతర సమస్య లు పరిష్క రించాలని కోరుతున్నా పాలకులు, అధి కారులు పట్టించుకోవడం లేదంటూ కార్మికులు ఆం దోళన చేస్తున్నారు.ఆశ్రమాల్లో వంటతో పాటు వివిధ రకాల పనులు చేసే దినసరి కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో విద్యార్థులకు ఆహారాన్ని వండే విషయంలో ఇబ్బం దులు తప్పడం లేదు. కార్మికులు సమ్మెలో ఉండడంతో ఉన్న కొంత మంది రెగ్యులర్ సిబ్బంది వంట చేసి విద్యార్థులకు అందించాల్సి వస్తుంది. సమ్మె నిరవధి కంగా కొనసాగితే సమస్య జఠిలమయ్యే పరిస్థితి నెలకొన్నది.

● గిరిజన విద్యార్థుల సంక్షేమానికి..

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రభుత్వం పలు ఆశ్రమాలు, పోస్టు మెట్రిక్ వసతి గృహలను నిర్వ హిస్తోంది. ఒకటి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు వసతి గృహాలు, ఆశ్రమాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లాలో 44 ఆశ్రమ పాఠశాలలు, 4 పోస్టు మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. ఇక్కడ సు మారుగా 11,560 మంది విద్యార్థులు చదువుతు న్నారు. ఆయా సంస్థల పరిధిలో వంట చేయడం, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడం, కార్యాలయాల్లో పనులు చేసేందుకు దినసరి వేత నంపై జిల్లా వ్యాప్తంగా 460 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరంత ప్రస్తుతం తమ సమస్యలు పరిష్కరిం చాలంటూ సమ్మెబాట పట్టారు. గతంలో 2023లో సమ్మె చేయగా సమస్యలు పరిష్క రిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేర వేర్చక పోవడంతోనే నిరవధిక సమ్మె బాట పట్టామని కార్మికులు చెబుతు న్నారు. అరకొర వేతనంపై పనిచేసే తమ సమస్యల పరిష్కారానికి పాలకులు శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి..

- అరిగెల కోటయ్య, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు



కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలను చెల్లించాలి. పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు ట్రెజరీలకు ఆదేశాలు ఇవ్వాలి. జీవో 64 నిలిపి వేసి పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలి.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి..

- ఆత్రం కన్నిబాయి, కార్మికురాలు



పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి. దినసరి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి 12 నెలల వేతనం చెల్లించాలి. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి రూ. 10 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలి. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

కార్మికుల డిమాండ్లు ఇలా..

దినసరి కార్మికులు పలు రకాల డిమాండ్లు తీర్చాలని సమ్మెబాట పట్టారు. ఈనెల 9న హైదరాబాద్‌లో ధర్నా చేయగా ఆ తర్వాత ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు విఫలం కావడంతో కార్మి కులు సమ్మెకు సిద్ధ మయ్యారు. ఈ క్రమంలో కార్మికుల డిమాండ్లు ఇవే.

- 2012 జీవోను సవరించి 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు ఉన్నవారిని రెగ్యూలర్ చేయాలి.
- ఔట్‌సోర్సింగ్ విధానాన్ని నిలిపి వేయాలి.
- జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లిం చాలి.
- పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు ట్రెజరీలకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి.
- గత సమ్మె కాలపు వేతనాలు ఇవ్వాలి.
- కొత్త మెనూ వల్ల పెరిగిన పని బారానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలి.
- 12 నెలలకు వేతనాలు(దసరా సెలవులు, సంక్రాంతి సెలవులు, వేసవి సెలవులకు కూడ)చెల్లించాలి.
- రూ. 10 లక్షల ప్రమాద బీమా చెల్లించాలి
- మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు దినసరి కార్మికులుగా తీసుకొవాలి.
- రిటైర్‌మెంట్ తర్వాత రూ. 5 లక్షలు ఇవ్వాలి, మట్టి ఖర్చులకు రూ. 50వేలు ఇవ్వాలి.
- వేతనంతో కూడిన వారంతపు సెలవులు ఇవ్వాలి.

● నిలిచిన పనులు..

తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో డెయిలీవేజ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దినసరి కార్మికులు సమ్మెబాట పట్టడంతో వివిధ రకాల పనులు నిలిచిపోయాయి. ప్రధా నంగా విద్యార్థులకు దినసరి కార్మికులే వంట చేయడం, వడ్డించడంలాంటి పనులు చేపడతారు. ఆశ్రమాల్లో శుక్రవారం నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో వంట పనులను రెగ్యూలర్ సిబ్బంది చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వంటను మి నహాయిస్తే ఇతర పనులు చేసేవారు లేకపోవడం తో ఇబ్బందులు కొంతమేర ఎదురవుతున్నాయి. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఈసారి సమ్మెను కొనసాగిస్తామని దినసరి కార్మికులు పేర్కొంటున్నారు.

అపూర్వ సమ్మేళనం


గురువులతో ఛాత్రోపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ బీఈడీ, శ్రీనిధి డీఎడ్ కాలేజ్ 2008-2009 మధ్య చదువుకున్న పూర్వ ఛాత్రోపాధ్యాయులు ఆదివారం 16 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. అప్పుడు తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

రెబ్బెన ఎస్సైగా వెంకటకృష్ణ

రెబ్బెన, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన ఎస్సైగా వెంకట కృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై చంద్రశేఖర్ కౌటాలకు బదిలీ అయ్యారు.

జిల్లాలో 32.4 మిల్లీమీటర్ల వర్షం

ఉప్పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు


కుమరంభీం ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా నీటిని వదిలిన అధికారులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 32.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చింతలమానేపల్లిలో 88.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కౌటాలలో 63.4, వాంకిడిలో 49.2, ఆసిఫాబాద్‌లో 44.8, బెజ్జూర్‌లో 31.4, సిర్పూర్(యూ)లో 26.4 దహెగాంలో 25.4, సిర్పూర్(టి)లో 25.2 రెబ్బెనలో 23.0, కెరమెరిలో 22.4, పెంచికల్‌పేటలో 22.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. లింగాపూర్, తిర్యాణి మండలాల్లో 20.8, కాగజ్‌నగర్‌లో 16.0, జైనూరులో 7.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. . కుమరంభీం ప్రాజెక్టులోకి 3,091 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో రెండు గేట్లు ఎత్తి 2,088 క్యూసెక్కుల వరదనీటిని అధికారులు కిందికి వదిలారు. దీంతో పెద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి కృష్ణపల్లి-సోమిని గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెన ఉప్పొంగి ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో హైలెవల్ వంతెనలు లేని కారణంగా ఏటా వర్షకాలంలో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): ఎగువన మహరాష్ట్రలో కురుస్తున్న బారీ వర్షాలకు ఆదివారం సిర్పూర్(టి) మండలంలోని వెంకట్‌రావుపేట పోడ్స గ్రామాల మధ్య ఉన్న పెన్‌గంగ ప్రమాదకర స్థాయిలో వంతెనను అనుకొని ఉప్పొంగి ప్రవహిస్తోంది. అలాగే పెన్‌గంగా ఉ ప్పొంగి ప్రవహిస్తుండడంతో బ్యాక్ వాటర్‌తో సిర్పూర్ (టి)-హుడ్కిలి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతె నపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో సిర్పూర్ (టి)-మహరాష్ట్ర వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు అటువైపు వెళ్లకుండ రెవెన్యూ, పోలీసు అధికారులు వంతెనల వద్ద పోలీసు పహరాను ఏర్పాటు చేశారు. పెన్‌గంగా పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం తుమ్మిడిహేట్టి వద్ద ఉన్న ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వార్ధానది ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో తుమ్మిడిహెట్టి వద్ద భారీగా నీటి ప్రవాహం పెరిగింది. పుష్కరఘాట్ల మెట్ల వద్దకు తాకుతూ ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం పెరుగుతుండటంతో పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రతమత్తమై ఎవరిని లోని పోనియకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు మండలంలోని నది పరివాహక ప్రాంతాలైన తుమ్మిడిహెట్టి, గుండాయిపేట, వీర్దండి, తాటిపెల్లి, పార్డి, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల్లో పంటలు నీట మునిగాయి.


ఉప్పొంగిన కృష్ణపల్లి-సోమిని లోలెవల్ వంతెన

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రెబ్బెన, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆసిఫాబాద్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన సునార్కర్ ఆనంద్‌రావు(38) బైకును ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. కాగజ్‌నగర్‌కు చెందిన తిరుపతి కృష్ణకు గాయాలయ్యాయి. ఎస్సై వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు గెలుపు

రెబ్బెన, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జనగాం జిల్లా కూనురులో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచినట్టు ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ బాలుర జట్టు నల్గొండ జట్టుపై 35-25, 35-30 తేడాతో గెలిచినట్టు పేర్కొన్నారు. గెలుపొందిన జట్టును ఉమ్మడి జిల్లా అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్

రెబ్బెన, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్ తెలిపారు. ఆదివారం డబ్ల్యుపీఎస్, జీఏ 92వ వార్షికోత్సవ పోటీలను సీఈఆర్ క్లబ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో రాణించాలన్నారు. సమావేశంలో డబ్ల్యుపీఎస్, జీఏ వైస్ ప్రసిడెంట్ రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) బెహరా, ఎస్టేట్స్ అధికారి సాగర్, ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్, డబ్లుపీఎస్, జీఏ చీఫ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రశాంత్, ఎఐటీయూసీ నాయకుడు మారం శ్రీనివాస్, జనరల్ కెప్టెన్ కిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాబా గ్రామ సమీపంలో వాగులో శనివారం మునిగి మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. మండలంలోని దాబా గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఒకే గ్రామంలో నలుగురు మృతి చెందడం విచారకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు వెళ్లాల్సిన చిన్నారుల మృతదేహాలను చూసి కంటతడి పెట్టారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ జాబిరె పెంటు, మాజీ సర్పంచులు సోయం భీంరావు, అయ్యూబ్ పాల్గొన్నారు.

ముగిసిన అంత్యక్రియలు

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాబా గ్రామం వాగులో శనివారం నీటిలో మునిగి మృతి చెందిన గ్రామానికి చెందిన చిన్నారులు వాడై మహెశ్వరి, ఆదె శశికళ, మొహర్లె గణేశ్‌తోపాటు అతడి తల్లి మొహర్లే నిర్మలాబాయికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతులు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి మాలీ కులస్థులు భారీగా తరలివచ్చి అంత్యక్రియలకు హాజరయ్యారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని దాబా గ్రామ వాగులో మునిగి మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. దాబా గ్రామాన్ని ఆదివారం సందర్శించి మృతుల కుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. ఒకే గ్రామంలో నలుగురు ప్రమాదవశాత్తు మృతి చెందడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చూస్తామని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ, దాదాజీ, గణేష్, అనిల్, దుర్గం జీవన్, పెంటు తదితరులు ఉన్నారు.